క్లుప్తంగా

విజేతలకు బహుమతుల అందజేత



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో బీపీఎల్‌–7 పేరుతో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండాల సురేశ్, నాయకుడు ఎగిరిశెట్టి నరేశ్ ఆధ్వర్యంలో లిమ్స్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మొత్తం ఆరు జట్లు పోటీపడగా ప్రథమ స్థానంలో పరమేశ్ జట్టుకు రూ.12వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన షేర్ బాబా జట్టుకు రూ.8వేల నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, యువకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాల 1993–94లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం కోహెడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులను మరోమారు నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశక్తినగర్ కాలనీ కార్యవర్గం ఎన్నిక

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ శ్రీ శక్తినగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ధ్యాసాని సుధాకర్ రెడ్డి, అధ్యక్షుడిగా వి.దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వినోద్‌కుమార్, కోశాధికారిగా బి.రాజలింగం, సంయుక్త కార్యదర్శిగా సి.జ్ఞానేశ్వర్‌చారి, సభ్యులుగా కే.రవిందర్, ఆర్.సురేశ్, కిషోర్, లింగారెడ్డి, అజయ్‌కుమార్, రూప, శిరీష, భూపేన్ పటేల్, శివకుమార్, శ్రీనివాస్ యాదవ్, అఖిలేశ్‌గౌడ్, పిచ్చిరెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

సన్మానం



ఫ్లోర్ లీడర్ శివకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ ఐదేళ్ల కౌన్సిలర్ పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రావిర్యాల బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం కార్యవర్గం ఎన్నిక



సంఘం కార్యవర్గ సభ్యులు

మహేశ్వరం: మహేశ్వరం పట్టణ శాఖ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం సంఘం ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో నియమించారు. అధ్యక్షుడిగా బజారు సురేందర్ రజక, ఉపాధ్యక్షులుగా చింతకింది రవీందర్, సీహెచ్.శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.సుధాకర్, కోశాధికారిగా సురేశ్, కార్యనిర్వాహణ అధికారిగా బి.గణేశ్, కార్యదర్శిగా సీహెచ్.బాలకృష్ణ, బిసందీప్, ప్రచార కార్యదర్శులుగా జి.మల్లేశ్, జి.రాజు, సీహెచ్.శ్రీకాంత్, ముఖ్య సలహాదారులుగా బి.సంగయ్య, జి.శంకర్, బి.కుమార్, సీహెచ్.సత్తయ్య, బి.బాలరాజ్, జి.కృష్ణలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక చేసి ఘనంగా శాలువాలతో సన్మానించారు. రజక సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు.

‘ఆత్మీయ భరోసా’తో పేదలకు మేలు

వ్యవసాయ భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ ‘భరోసా’గా నిలవనుంది. ఈ పథకం ఉపాధి కూలీలకు మేలు చేయనుంది. దీనికి అర్హులుగా సాగుభూమి లేకుండా, ఉపాధిహామీ పథకంలో ఏడాదికి 20 రోజులు పనిచేసిన కుటుంబానికి ఏటా రూ.12 వేలను ప్రభుత్వం అందించనుంది.

- ఉపాధిహామీ అధారంగా అర్హుల గుర్తింపు
- మండలంలో జాబ్‌కార్డుల సంఖ్య 6,576
- ఆక్టివ్ కార్డులు 3,073
- భూమి లేని కుటుంబాలు 257



పెద్దమ్మతండా లబ్ధిదారు సుగుణకు మంజూరు పత్రం అందజేస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి(ఫైల్)

మహేశ్వరం: కొత్తగా అమలు చేస్తున్న పథకాల్లో ఒకటైన ఇందిరమ్మ భరోసాకు ఉపాధిహామీ పనుల ఆధారంగా అర్హులను ప్రభుత్వం గుర్తిస్తోంది. సాగుభూమి లేనివారు.. ఉపాధి పథకంలో ఏడాదికి కనీసం 20 రోజుల పాటు పనిచేసిన కుటుంబాలకు భరోసాను ఇస్తామని ప్రకటించింది. ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా మహేశ్వరం మండలం పెద్దమ్మ తండా గ్రామంలో ప్రారంభించి, పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసింది.

అర్హుల గుర్తింపు ప్రక్రియ ఈజీఎస్‌కు

ఆత్మీయ భరోసా పథకం కింద అర్హుల గుర్తింపు ప్రక్రియను ఈజీఎస్ సిబ్బందికి ప్రభుత్వం అప్పగించింది. ఇలా సేకరించిన వివరాలను, అధికార యంత్రాంగం సూచించిన వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. దీని ఆధారంగానే ఇటీవల జరిగిన గ్రామసభలలో అర్హుల జాబితాను అధికారులు ప్రకటించారు. ఇంకెవరైనా పేర్కొన్న విధంగా ఉపాధి పనులు చేసి, భూమిలేని కూలీలు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

257 కుటుంబాల గుర్తింపు

ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉన్న కుటుంబాల వివరాలను ఎస్‌బీసీ సాఫ్ట్‌వేర్ నుంచి అధికారులు సేకరించారు. దీంతో మండల పరిధి 30 గ్రామాల్లో 6,576 జాబ్ కార్డులు ఉన్నట్లు గుర్తించారు. అందులో యాక్టివ్‌గా 3,073, పనికి వచ్చిన కుటుంబాలు 961, ఎలాంటి భూమి లేకుండా.. కనీసం 20 రోజులకు పైగా పని చేసిన కుటుంబాలు 257 ఉన్నట్లు పేర్కొన్నారు. దీని ఆధారంగా ఇటీవల జరిగిన గ్రామ సభలలో ఉపాధి, పంచాయతీ అధికారులు అర్హుల జాబితాను ప్రదర్శించారు. లిస్టులో పేరు లేని కూలీలు ఉంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 26న మండల పరిధి పెద్దమ్మతండాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ముగ్గురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఇదిలా ఉండగా.. కూలీల వివరాలను ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు సేకరిస్తున్నారు. వీరు సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. డివిజన్, జిల్లా స్థాయిలో ఏపీడీలు, పీడీ పర్యవేక్షిస్తున్నారు. కనీస పని దినాలు చేసిన 257 మంది కుటుంబాలను గుర్తించారు.



గంగారంలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి



ఆత్మీయ భరోసాకు అర్హులై ఉండి, జాబితాలో పేరు లేనివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలి. 2023– 2024 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజుల కన్నా ఎక్కువ పని చేసి, భూమి లేని నిరుపేదలకు ఈ పథకం వర్తిస్తుంది.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం



మాట్లాడుతున్న మాదిగ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

‘లక్ష డప్పుల’ను జయప్రదం చేయండి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ

మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలో మంగళవారం వేల గొంతులు–లక్ష డప్పుల చప్పుల జిల్లా సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంబేడ్కర్–జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 11 గంటలకు మహేశ్వరం మండల కేంద్రానికి మంద కృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. సమావేశానికి హాజరయ్యే ప్రతీ మాదిగ బిడ్డ డప్పు తీసుకొని రావాలన్నారు. ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో వేల గొంతులు–లక్ష డప్పుల చప్పుళ్ల మహా ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం మండల కేంద్రంలో జిల్లా సన్నాహక సభ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగలు, మాదిగ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంఘాలు, ఓసీ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. అంతకు ముందు మహేశ్వరం చౌరస్తాలో మంద కృష్ణ మాదిగ సభ జరగనున్న ప్రాంగణాన్ని నాయకులు పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాబు, మండల మాదిగ మాజీ ప్రజాప్రతినిధులు హన్మగల్ల చంద్రయ్య, వత్తుల రఘుపతి, బాట సురేశ్, తూర్పు జయరాజ్, ఆనందం, మనోహర్, పోచయ్య, సత్తయ్య, కిష్టయ్య, రమేష్, బాల్‌రాజ్, ఎన్.కుమార్, ప్రవీణ్, బి.రవి, జి.ప్రశాంత్, గణేశ్, కృష్ణ పలువురు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ పాలకుల హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. షాద్‌నగర్ శివారులో నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి బీఆర్‌ఎస్ హయాంలోనే మంజూరైందని, సగం పనులు పూర్తి చేసినా నాటి కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించలేదన్నారు. అదేవిధంగా కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు విస్తరించిన పాత జాతీయ రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి డబ్బులు ఇప్పించారన్నారు. పట్టణంలో నిర్మించాల్సిన రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను గత పాలకులే నిలిపివేయించారని ఆరోపించారు. అదేవిధంగా ఉద్యమకారుడు దిలీప్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకుడు మాధవులు మాట్లాడుతూ.. ఎంతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న గత మున్సిపల్ పాలకవర్గం వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్ పార్టీలో అధిక శాతం ఉద్యమకారులు అసంతృప్తితోనే ఉన్నారన్నారు. ఎదుటివారిని విమర్శించే ముందు తమకు తాము ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు అగ్గనూరు బస్వం, నలమోని శ్రీధర్, బుడ్డ నర్సింహ, హైదర్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుర్రంపల్లి ఉత్సవాలు



జాతరలో భక్తుల సందడి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లిలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 24న గంధం అలంకరణతో ప్రారంభమైన ఉత్సవాలు 25న దీపదూప అలంకరణ, 26న కందూరులు, 27న కవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో పూర్వ కాలంలోనే వెలసిన రాతి గుర్రం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ప్రతి ఏటా జనవరి చివరి వారంలో ఇక్కడ నిర్వహించే ఉత్సవాలకు రంగారెడ్డి, వికారాబాద్, హైద్రాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట తదితర జిల్లాలో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ జాతరకు కుల, మతాలకతీతంగా భక్తులు హాజరై దర్శించుకోవడం విశేషం. ఈ ఉత్సవాలు మరో నాలుగురోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

కేన్సర్ వ్యాధి నివారణ శిబిరం



శిబిరంలో పాల్గొన్న మహిళలు

హుడాకాంప్లెక్స్: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, తెలంగాణ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్ సత్యసాయి మందిరంలో కేన్సర్ వ్యాధి నివారణ శిబిరం నిర్వహించారు. ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్ వారి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, 136 మంది మహిళలు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారని వైద్య విభాగం ఇన్‌చార్జి భాస్కర్‌రావు తెలిపారు. హాస్పిటల్ మొబైల్ వ్యాన్ ద్వారా చేసిన వైద్య శిబిరంలో ముగ్గురు డాక్టర్లు, 8 మంది టెక్నీషియన్స్ సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు, సమితి కన్వీనర్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ న్యూ నాగోలు ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ వీ–గార్డ్, వాంబేకాలనీ, విజయపురికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం



నర్సింహ

మహేశ్వరం: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా మహేశ్వరం మండలం కోళ్ల పడకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నందిగామ నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయనకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతం, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. నాపై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రీతం, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

మొయినాబాద్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో చేగూరి రిషికిరణ్‌గౌడ్ జ్ఞాపకార్థం నిర్వహించిన విలేజ్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయంగా కొనసాగిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మంత్రిగా ఉన్న సబితారెడ్డి నియోజకవర్గంలో ఎన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారని ప్రశ్నించారు. రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, బీసీ బంధు, మైనార్టీ బంధు ఎంత మందికి ఇచ్చారన్నారు. అరకొర పథకాలు కూడా వారి పార్టీ వారికే చెందాయన్నారు. ప్రజలను మోసగిస్తూ పాలన కొనసాగించిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్కసారి వారు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ అర్హులందరికీ తప్పకుండా అందుతాయన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడవు వెంకటేశ్‌గౌడ్, పార్టీ మండల కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, మాజీ ఎంపీపీ పి.మహేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, సయ్యద్ అజీజ్, అనేగౌని పాండుగౌడ్, బి.ప్రశాంత్‌కుమార్, వి.బాబు, కె.వెంకటేశ్, బి.పాండురంగారెడ్డి, ఎ.ప్రభాకర్, అనిల్, మల్లేశ్, జగదీశ్, శ్రీనివాస్, ఎండీ మొయినుద్దీన్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు

- మాజీ మేయర్ చిగురింత పారిజాత



మాట్లాడుతున్న పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ అభివృద్ధికి ఈ ఐదేళ్లలో రూ.450 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు మాజీ మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. అభివృద్ధికి సహకారం అందించిన ప్రజలు, కార్పొరేటర్లు, అధికారులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం బాలాపూర్‌లో పారిజాత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. శానిటేషన్ విషయంలో 2022లో బెస్ట్ స్వచ్ఛత అవార్డు, క్లీన్ సిటీ అవార్డులు జాతీయ స్థాయిలో అందుకున్నామని తెలిపారు. రూ.9కోట్లతో బడంగ్‌పేట నూతన కార్పొరేషన్ భవనాన్ని నిర్మించామన్నారు. పేదల కోసం రూ.7కోట్లతో ప్రజాభవన్ (ఉచిత ఫంక్షన్ హాల్) నిర్మించినట్లు వెల్లడించారు. చెత్తను సేకరించి ఎరువుగా మార్చే డీఆర్‌సీసీ భవనాన్ని కుర్మల్‌గూడలో నిర్మించామన్నారు. రోడ్డు వెడల్పు కోసం బాలాపూర్ నుంచి బడంగ్‌పేట వరకు రూ.5కోట్లతో విస్తరించామని, అలాగే రూ.9కోట్లతో బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వరకు రోడ్ల విస్తరణకు ఖర్చు చేసినట్లు తెలిపారు. టెలికాం సాగర్ కాంప్లెక్స్ వరకు రూ.2.50 కోట్ల రోడ్లు, అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వరకు సుమారు రూ.3కోట్లతో రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. రాక్ గార్డెన్, హెచ్ఎండీఏ పార్కు, హరితపురి కాలనీ, ఆర్వీఆర్ కాలనీల్లో పార్కులు అభివృద్ధి చేశామన్నారు. అత్యంత అధునీకతతో జిల్లా లైబ్రరీని నిర్మించామన్నారు. 12, 25, 17 డివిజన్‌లలో బస్తీ దవఖానాలను ప్రారంభించుకున్నామన్నారు. రూ.1.40 కోట్లతో మల్లాపూర్‌లో హాస్పిటల్ నిర్మించామన్నారు. 9, 20, 29, 14 డివిజన్‌లలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే బాలాపూర్, మామిడిపల్లి, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడలోని గ్రేవీయార్డులను ఆధునీకరించామన్నారు. సుమారు రూ.70కోట్లతో చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మేయర్‌గా అవకాశం కల్పించిన ప్రజలకు, కార్పొరేటర్లకు, అభివృద్ధికి పూర్తి సహకారం అందించిన ఆధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలు ఉన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు అందె బాబన్న, అందె మోహన్, వెంకటేశ్, శ్రీధర్‌వర్మ, అశోక్, కొండె యాదయ్య, చెట్ల జంగయ్య, అంజయ్య, గడ్డమీది రమేశ్, నలమోని శ్రీధర్, బాల్‌రాజ్, మల్లేశ్, బుడ్డ నర్సింహ, జంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం షాద్‌నగర్ పట్టణ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు పంది వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అబ్దుల్‌రావుఫ్, మల్లేశ్, ఉమాప్రసాద్, అల్లాడ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కొమరేశ్, రవికుమార్, రాఘవేందర్, మీడియా కన్వీనర్‌గా ఆదిత్యారెడ్డి, కోశాధికారిగా మేకల వెంకటేశ్, ఉపకోశాధికారిగా నర్సింలు, మల్లేశ్, చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా జాకీరుద్దీన్, సలహాదారులుగా వంశీకృష్ణ, నాగిళ్ల వెంకటేశ్, సభ్యులుగా మిద్దెల వెంకటేశ్, రాఘవేందర్‌రెడ్డి, హరికృష్ణను ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులకు డివిజన్ అధ్యక్షుడు నియామకపత్రం అందజేశారు.

ఎస్సీ వర్గీకరణే ‘వేయి గొంతుల’ లక్ష్యం

ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాబాద్: వేయి గొంతులు, లక్ష డప్పులు మహా ప్రదర్శన విజయవంతం చేసి రాష్ట్రంలో మాదిగల ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జోగు అశోక్‌కుమార్, మండల నాయకుడు అక్కమొల్ల జంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7న వేల గొంతులు, లక్ష డప్పులు మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ వ్యతిరేక శక్తుల గుండెలు అదిరేలా వేల గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలుచేయాలని ప్రజా, కుల సంఘాల మేధావులు అభిప్రాయపడ్డారు. చేవెళ్ల డివిజన్ నాయకులు నాగని రామకృష్ణ(ఆర్కే) మాట్లాడుతూ.. మండంలోని అన్ని గ్రామాల మాదిగ బిడ్డ డప్పు వేసుకుని తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, బాల్‌రాజ్, బాలయ్య, కిష్టయ్య, మధు తదితరులు ఉన్నారు.